సాక్షి
ప్రకాశం

ఆదివారం । 21 । జనవరి । 2024



దేవదేవం భజే.. అయోధ్య రామం భజే

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. - 8లో..



పదవులు పోగానే అన్యాయం గుర్తొస్తుందా?

బీసీ కులగణన పారదర్శకంగా నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/21.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

28న షటిల్ బ్యాడ్మింటన్ వెటరన్ చాంపియన్ షిప్

ఒంగోలు: జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ వెటరన్ చాంపియన్‌షిప్, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక ఆదివారం నిర్వహిస్తున్నట్లు లార్డ్ కృష్ణా షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీ అధ్యక్షుడు జీఎస్ లక్ష్మణ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఒంగోలులోని తమ అకాడమీలో జరుగుతాయన్నారు. 35 ఏళ్లకు పైబడిన వారు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైన వారు త్వరలో రాజమహేంద్రవరంలో జరిగే నాలుగో రాష్ట్రస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

23న వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్ పోటీలు

ఒంగోలు: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఈనెల 23న జిల్లాలోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని పాఠశాలల బాలబాలికలకు వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో వీఎస్ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల సంరక్షణ అనే అంశంపై ఈ వ్యాసరచన ఉంటుందన్నారు. ఈ పోటీలో పాల్గొనే విద్యార్థినులు తమ పేర్లను మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎం.నాగకుమార్ శర్మ, సెల్ నంబర్ 9949405456 కు తెలియజేయాలన్నారు. పోటీల్లో ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు ఇస్తారన్నారు. పోటీలను స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారని, ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాతికేళ్ల పసిడి పంట

విదేశాలకే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ ఇప్పుడు మన ముంగిటకు వచ్చింది. అధిక ఔషధ గుణాలు కలిగిన ఫలమిది. రైతు ఇంట పాతికేళ్ల బంగారు పంటగా మారింది. ఒక సారి సాగు చేస్తే 25 సంవత్సరాల వరకు దిగుబడినిస్తుంది. చీడపీడల బెడద, నీరు, కూలీల ఖర్చు తక్కువ కావడంతో రైతాంగం ఈ డ్రాగన్ ఫ్రూట్‌పై మక్కువ చూపుతోంది. ఈ పంటకు మార్కెటింగ్ సదుపాయమూ ఉంది. అన్ని పండ్ల కంటే ఈ పండు ధరలు అధికంగా ఉండడంతో రైతులకు లాభార్జన సులభతరం అవుతోంది.

- జిల్లాలో విస్తరిస్తున్న డ్రాగన్ ఫ్రూట్ సాగు
- ఒకసారి నాటితే 25 ఏళ్ల వరకు దిగుబడి
- ప్రముఖ ఆన్‌లైన్ సంస్థ లోనూ మంచి గిరాకీ
- ప్రభుత్వ సాయంతో మరింత పెరిగే అవకాశం



దర్శిలో సాగు చేసిన డ్రాగన్ తోట



డ్రాగన్ పండు

ఒంగోలు సెంట్రల్: రకరకాల వాణిజ్య పంటలు, మామిడి తోటల కంటే రెండు దశాబ్దాల పాటు నికర ఆదాయాన్ని అందించే కొత్త వంగడాల వైపు జిల్లాలోని రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇన్నాళ్లు తైవాన్, వియత్నాం దేశాలకే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ ఇక్కడి వాతావరణ పరిస్థితులతోనూ పండుతోంది. దేశంలో మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా అందుబాటులోకి వచ్చేసింది. ఆరేళ్ల కిందటి వరకు ఈ పండు గురించి చాలా తక్కువ మందికే తెలుసు. కరోనా తర్వాత దీని ప్రాముఖ్యత అందరికీ తెలిసింది. దీనిని పిటాయా అని కూడా పిలుస్తారు. బ్రహ్మజముడు జాతికి చెందిన ఈ మొక్కలో అధిక పోషకాలు ఉన్నాయి. ఈ పండు పైనాపిల్, కివీ పండ్ల రుచిని పోలి ఉంటుంది. నాటిన తొలి ఏడాది మూడు నుంచి రూ.5 లక్షలు పెట్టుబడి పెడితే రెండేళ్లలో ఆ మొత్తం వచ్చేస్తోంది. ఆపై 25 ఏళ్ల పాటు ఏటా రైతులకు ఆదాయం వస్తుండటంతో ఇప్పుడు రైతులు డ్రాగన్ ఫ్రూట్ సాగుపై మక్కువ చూపుతున్నారు. పైగా ఈ పంటకు చీడపీడల బెడదలు, కూలీల సమస్య తక్కువ. ముఖ్యంగా తక్కువ నీటి సౌకర్యమున్న రైతులకు వరం. రైతు పండించిన పంటకు తోటల వద్దే మార్కెటింగ్ సౌకర్యం ఉంది. పండు కిలో నాణ్యతను బట్టి రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. మరోవైపు స్విగ్గీ, బిగ్ బాస్కెట్, రిలయన్స్ తదితర ఆన్‌లైన్ సంస్థలు సైతం వీటిని కొనుగోలు చేస్తున్నాయి.



మాధవరంలో సాగు చేసిన డ్రాగన్ తోట

■ సాగు విధానం:
త్వరగా ఎత్తు పెరిగే డ్రాగన్ ఫ్రూట్ మొక్కను నిటారుగా ఎదగటానికి స్తంభాలు ఏర్పాటు చేయాలి. పందిరి పద్ధతిలో నాటే ఈ మొక్కకు ఎకరానికి 400 నుంచి 420 సిమెంట్ లేదా రాయి పోళ్లు అవసరమవుతాయి. ఏడు అడుగుల స్తంభాల్లో రెండు అడుగులు భూమిలో పాతి మిగిలినది పైభాగంలో ఉంటే చూడాలి. ఒక్కో మొక్క ఖరీదు రూ.80 వరకు ఉంటుంది. మూడేళ్ల వయస్సు తోటల నుంచి మొక్కలను కొనుగోలు చేసి తెచ్చి నాటుకోవచ్చు. హెక్టారుకు 1100 నుంచి 1350 వరకు మొక్కలు నాటవచ్చు. అధిక సాంద్రత పద్ధతిలో ఎకరానికి 445 నుంచి 546 మొక్కలను మొక్కకు మొక్కకు మధ్య 2.5 మీటర్ల దూరం ఉండేలా నాటుతారు. డ్రిప్ ఏర్పాటు చేసుకుంటే ఒక్కో మొక్కకు రోజుకు రెండు నుంచి నాలుగు లీటర్ల నీరు సరిపోతుంది. ఎకరానికి డ్రిప్, పోళ్లు, మొక్కలు, ఎరువుతో కలుపుకుని రూ.5 లక్షల వ్యయం అవుతుంది. ఒకటిన్నర సంవత్సరానికే కాపు వచ్చినా మంచి దిగుబడి రావటానికి మూడు సంవత్సరాలు పడుతుంది. బాగా ఎదిగిన తోట నుంచి ఎకరాకు 20 నుంచి 30 మెట్రిక్ టన్నుల కాయల దిగుబడి వస్తుంది.

■ మంచి పోషకాలు కలిగిన ఫలం..
డ్రాగన్ ఫ్రూట్‌కు విదేశాల్లో ధనికుల ఫలం అనే పేరుంది. కానీ నేడు స్థానికంగా ఈ సాగు మొదలు కావటంతో తోటల వద్దే ఫలాలను విక్రయిస్తున్నారు. దీనిలో అధిక పోషకాలు ఉన్నాయి. ఈ పండు పైనాపిల్, కివీ పండ్ల రుచిని పోలి ఉంటుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. మధుమేహం, క్యాన్సర్ నివారణ, జీర్ణవ్యవస్థ మెరుగుపడటం, గుండెకు సంబంధించి, మంచి కొలస్ట్రాల్‌ను, మంచి చర్మకాంతికి, జుట్టు పెరిగేందుకు ఎముకల పుష్టికి మేలు చేస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచి ఇన్‌ఫెక్షన్లు రాకుండా చేస్తుంది. పండ్ల మార్కెట్లోనూ ఇవి విరివిగా లభ్యమవుతున్నాయి.

మూడు ఎకరాల్లో సాగు చేశాను



మేము మూడేళ్ల కిందట డ్రాగన్ పంట వేశాను. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నాం. పండుకు గిరాకీ బాగా ఉంది. కిలో రూ.200 వరకు ఉంది. తోట దగ్గరకి వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

– రామిరెడ్డి, మాధవరం, రైతు

కొత్త పంటల సాగుతో మేలు



ఆహారం, వాణిజ్య పంటలను పండించి గిట్టుబాటు కాని రైతులు ఇప్పుడు భిన్నంగా ఆలోచిస్తున్నారు. సాంఘిక మాధ్యమాల ద్వారా ప్రపంచంలోని పలు రకాల కొత్త వంగడాలు, పంటల సాగుపై మక్కువ పెంచుకుంటున్నారు. ఇటీవల డ్రాగన్ ఫ్రూట్ సాగుపై రైతులు ఆసక్తి చూపడం మంచి పరిణామం. దీంతో పంటలు పెట్టుబడి తొలి ఏడాది ఎక్కువగా ఉన్నా ఆపై రెండు దశాబ్దాల పాటు నికర ఆదాయాలుంటాయి.

– వై గోపిచంద్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి

■ తెగుళ్లకు దూరం:
ఈ మొక్కను తెగుళ్లు పెద్దగా ఆశించవు. అప్పుడప్పుడూ ఫంగస్ వంటి తెగుళ్లు ఆశిస్తాయి. ఉద్యానవన శాఖ అధికారుల సలహాలతో అవసరమైన మందులను పిచికారి చేసి నివారించవచ్చు. షేడ్ సమస్యను తొలగించటం కోసం తోటలో మునగ మొక్కలను సాగు చేస్తే సరిపోతుంది.

■ రాయితీ ఇలా...
డ్రాగన్ తోటను ప్రోత్సహించటం కోసం ఉద్యానవన శాఖ రాయితీ ఇస్తుంది. హెక్టారుకు మొదటి సంవత్సరం రూ.30 వేలు, రెండు మూడు సంవత్సరాల్లో రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలు ఇస్తోంది.

■ జిల్లాలో సాగు వివరాలు:
జిల్లాలో 75 ఎకరాలకుపైగా డ్రాగన్ ఫ్రూట్ తోటలు సాగు చేశారు. ఇందులో పింక్, వైట్, ఎల్లో వంటి రకాలు ఉంటాయి. వాటిలో పింక్ కు బాగా గిరాకీ ఉంది.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

- వరుసగా మూడోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం
- శక్తివంచన లేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
- పార్టీ కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో మంత్రి మేరుగు నాగార్జున
- పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి:

పార్టీ కార్యకర్తలందరూ కలిసిమెలిసి ఐక్యంగా పనిచేద్దాం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ రెండోసారి సీఎంగా చేసుకుందామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేరుగు నాగార్జున కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యకర్తల పరిచయ కార్యక్రమానికి మంత్రితో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సంతనూతలపాడు నియోజకవర్గంలో పోటీ చేస్తున్నానన్నారు. బూచేపల్లి కుటుంబం అండదండలతో సంతనూతలపాడు నియోజకవర్గంలో వరుసగా మూడో సారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దామని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా సీఎం ఆదేశాలతో పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని కార్యకర్తలకు మంత్రి మేరుగు నాగార్జున విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాన్ని శక్తివంచన లేకుండా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి మేరుగు నాగార్జునను గతంలో పార్టీకి వచ్చిన మెజారిటీకంటే ఎక్కువ ఓట్లతో గెలిపించాలని కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వరుసగా మూడోసారి వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలన్నారు. దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ మంత్రి మేరుగు నాగార్జునకు బూచేపల్లి కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల వలన ఆయన్ను మళ్లీ గెలిపించేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. చీమకుర్తి మండల స్థాయిలో త్వరలో ఎన్నికల కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో కార్యకర్తలందరూ కలిసి పని చేసి మేరుగు నాగార్జునను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. తొలుత గోనుగుంట గ్రామస్తులకు ఇంటి పట్టాలను వారి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమానికి ముందు కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామాల్లోని పలు సమస్యలను మంత్రి మేరుగు నాగార్జున, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి దృష్టికి కార్యకర్తలు తీసుకొచ్చారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్ణిపాటి శేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోగినేని వెంకటేశ్వర్లు, చీమకుర్తి సొసైటీ ప్రెసిడెంట్ గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, పలు గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి మేరుగుకు సన్మానం

విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా శిల్పం ఏర్పాటు చేసిన స్వరాజ్ మైదాన్ ప్రాజెక్ట్‌కు మంత్రి మేరుగు నాగార్జున చైర్మన్‌గా వ్యవహరించటంతో మేరుగు నాగార్జునను బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, మండల, పట్టణ పార్టీ కన్వీనర్‌లు పమిడి వెంకటేశ్వర్లు, క్రిష్ణిపాటి శేఖరరెడ్డి, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి



మంత్రి మేరుగు నాగార్జునను సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టు శిక్షణ



కబడ్డీ శిక్షణలో క్రీడాకారులు

- పాల్గొంటున్న ఎనిమిది జిల్లాల క్రీడాకారులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి అండర్ 14 కబడ్డీ జట్టు శిక్షణ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఏపీలోని పలు జిల్లాల్లో పాఠశాలల క్రీడాకారులకు ఇక్కడ పది రోజులుగా కబడ్డీలో మెళకువలు నేర్పిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల పీడీ, కబడ్డీ జట్టు కోచ్ ఎం.బాలగురవయ్య, పీడీ ఎస్ రవీంద్రబాబు మాట్లాడుతూ 12 రోజుల పాటు జెడ్పీ పాఠశాల ఆవరణలో ఏపీలోని ప్రకాశం, కర్నూలు, వైఎస్సార్ కడప, విజయనగరం, తూర్పు గోదావరి, చిత్తూరు, శ్రీకాకుళం, ఎన్‌టీఆర్ జిల్లాల నుంచి ఎంపికైన 20 మంది కబడ్డీ క్రీడాకారులకు పీఈటీల పర్యవేక్షణలో కఠోర శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఈ నెల 24వ తేదీన ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఇక్కడ శిక్షణ పొందిన కబడ్డీ క్రీడాకారులు పాల్గొంటారని అన్నారు. ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని శిక్షణలో మంచి మెళకువలు నేర్చుకోవాలని కోరారు.



వ్యాయామం చేయిస్తున్న క్రీడాకారులు

రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి

- బ్రోచర్ ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: రహదారి భద్రత.. ప్రమాదాలపై ప్రజలకు విస్తృతమైన ప్రచారం చేసి అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ప్రకాశం భవనంలో రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు నిర్వహించే రహదారి భద్రతా కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్, పోస్టర్, కరపత్రాలను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రహదారుల వెంట ప్రమాదాలు జరగకుండా తగిన సూచనలతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. నిబంధనలు పాటించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో ఉప రవాణా కమిషనర్ ఆర్ సుశీల, ఆర్‌టీఓలు, పోలీసు అధికారులు, నేషనల్ హైవే, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



రహదారి భద్రత మాసోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

క్లుప్తంగా

23న విభిన్న ప్రతిభావంతుల జాబ్‌మేళా

ఒంగోలు సెంట్రల్: జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతి ఉపాధి కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులకు పలు రకాల ఉద్యోగాల నియామకానికి ఈనెల 23న ఒంగోలులో జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ సహాయ సంచాలకురాలు జి.అర్చన తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం పది గంటల నుంచి మూడు గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి, పదో తరగతి ఆపైన విద్య అభ్యసించిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు రూ.1.2 లక్షల నుంచి రూ.3.1 లక్షల వరకు వేతనం ఇస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని విభిన్న ప్రతిభావంతులైన యువతీ యువకులు ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు 7989244381, 9160797311ను కార్యాలయ వేళల్లో సంప్రదించాలని సూచించారు.

గ్యాస్ సిలిండర్ల అక్రమ విక్రయాలపై దాడులు

ఒంగోలు అర్బన్: పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో వంట గ్యాస్ సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించినట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆరు బృందాలతో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌లు వ్యాపార అవసరాలకు మళ్లిస్తున్న వారిపై 6ఏ కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో దాడులు నిర్వహించి, అక్రమంగా వినియోగిస్తున్న 36 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటికి సంబంధించి మొత్తం 8 కేసులు నమోదు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్‌లు దుర్వినియోగం అయితే ప్రజలు కూడా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. దాడులను ఇకముందు కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

యూజీసీ నెట్‌లో సచివాలయ ఉద్యోగి ప్రతిభ


వైష్ణవి

మార్కాపురం రూరల్: యూజీసీ నెట్‌లో మార్కాపురం మండలం గొట్టిపడియ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వైష్ణవి ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయిలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్షలో జనరల్ కేటగిరీలో 300 మార్కులకు గాను 178 మార్కులు సాధించి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత సాధించారు. వైష్ణవి తండ్రి డాక్టర్ సీఎస్ఆర్ మూర్తి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ జ్యుడీషియల్ ప్రివ్యూ జడ్జి జస్టిస్ శివ శంకరరావు వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పని చేస్తున్నారు. వైష్ణవిని ఏపీ ఎన్‌జీఓ సంఘం కార్యదర్శి వి.శ్రీనివాస్‌తోపాటు సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 2799 మంది హాజరు


ఒంగోలులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఒంగోలు: జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా సాగిందని ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 18 సెంటర్లలో పరీక్షలు నిర్వహించామని, 3,921 మందికిగాను 2799 మంది హాజరయ్యారని వివరించారు. ఐదుగురు రూట్ ఆఫీసర్లు తనిఖీ అధికారులుగా వ్యవహరించారన్నారు. నవోదయ విద్యాలయ అధ్యాపకులు పరీక్షల కేంద్రాల అబ్జర్వర్లుగా వ్యవహరించారని, కేంద్రాల హెడ్మాస్టర్లు, సూపరింటెండెంట్లు పూర్తి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించారని చెప్పారు. సహకరించిన జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు, పరీక్షల సహాయక కమిషనర్ శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

సింగరాయకొండ: బైక్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో జరుగుమల్లి మండలం కామేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. 108 కొండపి సిబ్బంది కథనం ప్రకారం.. అద్దంకికి చెందిన కాలేషా కామేపల్లిలో ప్రశ్న చెప్పి తాయత్తు కడతారని తెలిసి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఉండగా బైక్ అదుపు తప్పి కింద పడటంతో ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అతను మద్యం మత్తులో ఉన్నాడని, చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించామని 108 సిబ్బంది తెలిపారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించినట్లు కాలేషా బంధువులు చెప్పారు. అయితే ఈ ప్రమాదం సంభవించిన ప్రాంతం తమ పరిధి కాదని, ఆస్పత్రి నుంచి ఎటువంటి సమాచారం రాలేదని కొండపి, జరుగుమల్లి ఎస్సైలు చెప్పారు. 108 సిబ్బంది మాత్రం జరుగుమల్లి మండల పరిధిలోకి వస్తుందని వివరించారు.

మోక్షపురి అయోధ్యలో శ్రీ రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మితమైన దివ్యమైన భవ్య మందిరంలో ఈనెల 22వ తేదీ సోమవారం బాల రాముని ప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా భారతీయులు అందరూ సంబరాలు నిర్వహించుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి అనుగుణంగా భక్తులు తమ ఇంట శ్రీరామ జయ రామ అనే మహా మంత్రాన్ని పఠిస్తూ శ్రీరామునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను టీవీలు, సామాజిక మాధ్యమాల ద్వారా, భారీ తెరలపై కనులారా వీక్షిస్తున్నారు.

- అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠాపన సందర్భంగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు
- ఆధ్యాత్మిక సంస్థలతో సాంస్కృతిక ప్రదర్శనలు
- సీతారామ మందిరాల్లో ప్రత్యేక పూజలు
- ఒంగోలు నగరంలో వీధివీధినా శ్రీరామ సంబరాలు


అయోధ్య రామ మందిరం

దేవ దేవం భజే.. అయోధ్య రామం భజే..



ఒంగోలు మెట్రో:

ఒంగోలు నగరంలో ప్రతి దేవాలయాన్ని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒకరోజు ముందు 21వ తేదీ ఆదివారం నుంచి దేవాలయాల్లో సీతారామ కళ్యాణ మహోత్సవాలు, పలు హైందవ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్రలు నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 21వ తేదీ ఆదివారం స్థానిక అమలనాధుని వారి వీధిలో కొలువైన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఉదయం 9 గంటలకు సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 22వ తేదీ సోమవారం స్థానిక గాంధీ రోడ్డు బంగారు కొట్ల వద్ద గల శ్రీ అనంత కోదండరామ స్వామి దేవస్థానంలో దేవస్థాన కమిటీ, సేవా సమితి అర్చక స్వాములు, గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్ అసోసియేషన్, గోవిందమాల భక్త బృందం, దాసరి చారిటీస్, అయ్యప్ప స్వామి దేవస్థానం, గీతా మందిర కమిటీ, శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ, మల్లవరం వాసవీ ఆర్యవైశ్య సత్రం వారు సంయుక్తంగా వసుధైక శ్రీరామ సంబరాలను ఉదయం 5 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు వివరించారు. 12 గంటలకు కోదండ రామస్వామి కళ్యాణ మహోత్సవం, హనుమాన్ చాలీసా పఠనం, సాయంత్రం ఐదు గంటలకు కళ్యాణ రాముని నగరోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం స్థానిక లాయర్ పేట షిర్డీ సాయి మందిరంలో సాయంత్రం 6 గంటలకు ×దేవ దేవం భజే అయోధ్య రామం భజే₹ పేరిట శ్రీ నళిని ప్రియా నృత్యనికేతన్ శ్రీ శారద సంగీత కళాశాల విద్యార్థులచే శ్రీరాముని కీర్తిస్తూ కూచిపూడి నృత్యాలు మరియు గీతాలను ఆలపిస్తారని శ్రీ నళిని ప్రియా నృత్య నికేతన్ నృత్య శిక్షకురాలు ఎస్ వి.శివకుమారి తెలిపారు.

22వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక సంతపేటలోని జగద్గురు శంకరాచార్య కంచి కామకోటి పీఠపాలిత శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సీతారామస్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. 21వ తేదీ ఆదివారం స్థానిక అంజయ్య రోడ్డులోని ఆంధ్ర కేసరి విద్యాకేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సంస్కార భారతి నేతృత్వంలో విద్యార్థులకు శ్రీరాముని వేషధారణ పోటీలు, శ్రీరామునిపై కవితా రచన, పఠన పోటీలు, దేశభక్తి గీతాల బృందగాన పోటీ, శ్రీరాముని చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

అయోధ్యలో ప్రతిష్ఠించే రామ యంత్రం ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచే..



అయోధ్యలో బాల రాముని విగ్రహం కంటే ముందుగా శ్రీరామ యంత్రాన్ని ప్రతిష్ఠాపన చేస్తారు. అయితే ఆ మహిమాన్వితమైన యంత్రాన్ని మంత్ర పూర్వకంగా సిద్ధం చేసిన ధన్యజీవి మన ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తి. చీరాల వాస్తవ్యులైన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, హనుమత్ ఉపాసకులు అన్నదానం చిదంబర శాస్త్రి రాములవారి మందిర నిర్మాణం జరిగి తీరుతుందని సంకల్పం తీసుకుని బంగారంతో రామయంత్రాన్ని సిద్ధం చేసి 14 కోట్ల రామనామ జపాన్ని నిక్షేపణ చేశారు. పవిత్రమైన కార్తీక మాసంలో ప్రత్యేక పూజల నిమిత్తం అయోధ్యకు పంపించారు. ఇప్పుడు ఆ యంత్రాన్నే గర్భాలయంలో ప్రతిష్ఠిస్తున్నారు.

125 కలశాలతో శోభాయాత్ర



నగరంలో ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో 125 కలశాలతో వెండి రథంలో శ్రీరాముని వెండి ఉత్సవ మూర్తులను ఊరేగిస్తూ స్థానిక గడియారం వారి వీధిలో అనంత కోదండ రామ స్వామి మందిరం నుండి శోభాయాత్ర బయలు దేరుతుంది. కార్యక్రమంలో హనుమాన్ చాలీసా రామభజన కోలాట బృందాలు, మార్వాడి మహిళల నృత్య ప్రదర్శన, ఆర్ఎస్ఎస్ పతంజలి యోగ సభ్యులు శోభాయాత్రగా గీతా మందిరం వరకు నగర ఊరేగింపు నిర్వహిస్తారు.

– తాతా బదరీనాథ్, ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు

ధర్మానికి కట్టుబడిన రాముడు



ధర్మానికి కట్టుబడ్డాడు కనుకనే రాముడు అంటే నాకు ఇష్టమైన దైవమని సాక్షాత్తు శివుడే పార్వతితో చెబుతాడు. కష్టాలు వచ్చినప్పుడే మనం దేవుడిని ఆశ్రయిస్తాం. అంతులేని కష్టాలని ఎదుర్కొన్న సీతారాముల జంట మనకు ఆరాధ్య దైవాలు. వారి కంటే మన కష్టాలు బాధలు ఎరిగిన దైవాలను ఎక్కడ నుంచి తీసుకురాగలం. మన పూర్వులు రామాయణ భారత గాథలు వింటూ జీవితాల్లో కష్టాలను తేలిగ్గా తట్టుకున్నారు. నేటి తరం ఈ సంప్రదాయాన్ని అలవాటు చేసుకోవాలి.

– మాత విజ్ఞానంద సరస్వతి, లలితాశ్రమ నిర్వాహకులు

పదవులు పోగానే అన్యాయం గుర్తొస్తుందా?

- పచ్చి అవకాశవాద రాజకీయాలు సరికాదు
- బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కేశన శంకరరావు
- బీసీ కుల గణన పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వానికి వినతి


మాట్లాడుతున్న కేశన శంకరరావు

ఒంగోలు: బీసీ కుల జన గణన పారదర్శకంగా నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార, ప్రతిపక్ష పార్టీల్లో పదవులు అనుభవించిన వారు పదవులు పోగానే బీసీల అస్తిత్వం గుర్తుకు రావడం, బీసీలకు అన్యాయం జరిగిందంటూ వాపోవడం పచ్చి అవకాశవాదమని అన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు, బీసీ కుల జన గణన, మహిళా రిజర్వేషన్ చట్టంలో బీసీ మహిళలకు దామాషా విధానంలో కోటా, 10 శాతం రిజర్వేషన్లు ఆధిపత్య కులాలకు కేటాయిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేస్తున్నప్పుడు మౌనంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. బీసీ నాయకులు తమ పదవులు పోయిన తర్వాత శోకండాలు పెడితే బీసీ సంఘాలు గాని, బీసీలు గాని ఎవరూ పట్టించుకోరన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలను, సోదర దళిత, ఆదివాసీ, మైనార్టీలను నమ్ముకుంటే బీసీ నాయకులకు ఆత్మగౌరవం, బీసీలకు రాజ్యాధికారం, సామాజిక న్యాయం లభిస్తాయన్నారు. జిల్లా అధ్యక్షుడు బలగాని ఆంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ కుల జనగణన పారదర్శకంగా చేపట్టడంతోపాటు ప్రతి జిల్లాలో మూడు సీట్లు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ అజీజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కేవీ శేషమ్మ, మహిళా అధికార ప్రతినిధి దేవరంపాటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి మృతిపై భిన్న వాదనలు


మృతి చెందిన చిన్నారి

ముండ్లమూరు: మండలంలోని వేముల గ్రామానికి చెందిన నాలుగు నెలల చిన్నారి మృతిపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన గజ్జల శ్రీనివాసరెడ్డి, కుసుమ దంపుతల రెండో కుమార్తెకు శనివారం ఆరోగ్య శాఖ సిబ్బంది టీకా వేశారు. గంట తర్వాత చిన్నారి అస్వస్థకు గురికావడంతో కుటుంబ సభ్యులు దర్శికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో టీకా వికటించి నాలుగు నెలల చిన్నారి మృతి చెందినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా.. అదే టీకాను ఆరుగురు చిన్నారులకు వేశామని టీకాలో ఎలాంటి లోపం లేదని ముండ్లమూరు వైద్యాధికారి జాస్మిన్ తెలిపారు. వ్యాక్సిన్ వికటిస్తే దద్దుర్లు వస్తాయని తెలిపారు. కానీ చిన్నారిలో అలాంటివేమీ లేవన్నారు. వారం రోజులుగా జలుబు ఉండడంతో వ్యాక్సిన్ వేయడం నిలిపామని సిబ్బంది తెలిపారు. జలుబు తగ్గిందని తల్లి కుసుమ స్థానిక హెల్త్ సెంటర్‌కు తీసుకురావడంతో అందరితోపాటు చిన్నారికి వ్యాక్సిన్ వేసినట్లు ఏఎన్ఎం చెప్పారు. వ్యాక్సిన్ వేసిన చిన్నారులను అందరినీ అరగంట వరకు ఏఎన్ఎం అబ్జర్వేషన్‌లోనే ఉంచగా అంతా హుషారుగానే ఉన్నారని నిర్ధారణకు వచ్చామని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ఇంటికి వెళ్లాక గంట తర్వాత చిన్నారి అస్వస్థతగా ఉందని చెప్పడంతో వెళ్లి పరిశీలించామన్నారు. వ్యాక్సిన్ వల్ల చిన్నారి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు భావిస్తే పోస్టుమార్టం నిర్వహించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని వైద్యాధికారి జాస్మిన్ స్పష్టం చేశారు.

ఫైనల్‌కు చేరిన బళ్లారి, శ్రీకాకుళం


మ్యాచ్‌లో తలపడుతున్న బళ్లారి-శ్రీకాకుళం జట్లు

పర్చూరు (చినగంజాం): సౌత్ ఇండియా స్థాయి టీ–20 మ్యాచ్‌లు చివరి దశకు చేరుకున్నాయి. సెమీ ఫైనల్స్‌లో బళ్లారి, శ్రీకాకుళం టీంలు విజయం సాధించి తుది పోరుకు సిద్ధమయ్యాయి. పర్చూరులో నిర్వహిస్తున్న సౌత్ ఇండియా స్థాయి క్రికెట్ మ్యాచ్‌లో శనివారం రెండు సెమీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. – ఉదయం మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ మ్యాక్ లెవెన్ (బళ్లారి), మస్తాన్ లెవెన్ (జార్ఖండ్)ల మధ్య జరిగింది. టాస్ గెలిచి కర్ణాటక తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసి భారీ లక్ష్యాన్ని జార్ఖండ్ ముందు ఉంచింది. జట్టులో తాహ 47 బంతుల్లో 101 పరుగులు సాధించాడు. వాటిలో 4 బౌండరీలు, 10 సిక్సర్లతో తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. మరో బ్యాటర్ ప్రవీణ్ దూబే 22 బంతుల్లో 50 పరుగులు చేసి జార్ఖండ్ బౌలర్లను బెంబేలెత్తించాడు. తరువాత బ్యాటింగ్‌కు దిగిన మస్తాన్ లెవెన్ 17.3 ఓవర్లలో ఆలౌట్ అయి 106 పరుగులు మాత్రమే సాధించింది. దీంతో కర్ణాటక 112 పరుగులతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. సెంచరీ సాధించిన తాహ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు.

విజయ దుంధుభి మోగించిన శ్రీకాకుళం..

మధ్యాహ్నం రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో సిక్కోలు చీతాస్ (శ్రీకాకుళం), ఒంగోలు బుల్స్ తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం నిర్ణీత 18 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. జట్టులో కేపీ సాయి రాహుల్ 41 బంతుల్లో 62 పరుగులు చేశాడు. అందులో 4 బౌండరీలు, 3 సిక్సర్లు ఉన్నాయి. అదేవిధంగా ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్ వేగంగా ఆడి 34 బంతుల్లో 55 పరుగులు సాధించాడు. తరువాత లక్ష్య ఛేదనకు దిగిన ఒంగోలు 16.2 ఓవర్లలో ఆలౌట్ అయి 131 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 36 పరుగుల తేడాతో శ్రీకాకుళం విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఒంగోలు జట్టులో గుట్టు రోహిత్ మాత్రమే 24 బంతుల్లో 41 పరుగులు సాధించాడు. శ్రీకాకుళం బౌలర్ శ్రీనివాస్ 4 ఓవర్లలో 34 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసి ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. దీంతో శ్రీనివాస్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఆదివారం ఫైనల్ మ్యాచ్ బళ్లారి, శ్రీకాకుళం మధ్య జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.